కరుణ

"శ్రీ ఈరంకి"

సుబ్రహ్మణ్యంగారు సామాన్య కుటుంబీకుడు. దగ్గర దగ్గరగా పదెకరాల భూవసతి, నాలుగైదువేల రూపాయల రొఖ్ఖం ఉంది. ఇంక భార్య రెండు మూడు సంవత్సరాలకు పోతుందనగా కొత్త యిల్లు కట్టించేరు. ఇంట్లో ఒక్క బెడద తప్పితే మ్మరేం లేదు. వద్దు వద్దంటే ఆయన భార్య పట్టుపట్టి తన తమ్ముడు ఉబ్బసపు వ్యాధితో బాధ పడేవానికి, అతని వాటాకు వచ్చే ఆరెకరాల భూమికోసం ఆశపడి 10 సంవత్సరాల తన కూతురునిచ్చి పెళ్ళిచేసింది. పెళ్ళయి ఆరు మాసాలేనా కాకుండా ఆపిల్ల వైధవ్యం అనుభవించ వలసివచ్చింది. సుబ్రహ్మణ్యంగారికి ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు. పెద్ద ఆడపిల్లలు ఇద్దరూ కాపరానికి వెళ్ళారు. మూడో పిల్ల కమలకి వైధవ్యం సంభవించింది. మిగతా కుర్రాళ్ళిద్దరూ చిన్న పిల్లలు. ఆ ఊళ్ళో ఉన్న బోర్డు స్కూల్లో చదువుకుంటున్నారు. ఇంట్లో పెద్దదిక్కు సుబ్రహ్మణ్యంగారి అక్కగారు వెంకమ్మగారు మాత్రమే.

వెంకమ్మగారు తమ్ముణ్ణి ఇంకో పెళ్ళి చేసుకోమని బలవంతం చేయడం మొదలు పెట్టింది. తనకి చేసుకుందామనే ఆశఉన్నా 'పిల్లనిచ్చే పెద్ద ఎవరా!' అనే సందేహం కొద్దీ అంతగా పట్టించుకునేవారు కారు సుబ్రహ్మణ్యంగారు. ఈ పరిస్థితిలో తికమక లాడుతున్న సుబ్రహ్మణ్యంగారికి కూతురు కమలయొక్క భావిజీవితపు సమస్య బోధపడక బాధపడుతున్నారు. హిందూ ధర్మశాస్త్రరీత్యా ఆలోచిస్తే కమలకి సంఘం బోధచేసేది. చప్పిడిపిండి, పీఘూదిబుట్ట, దూది పింజి, గోవిందనామాలు. కమల యుక్తవయస్కురాలు. మానవులకు ఉండవలసిన కోర్కెలు ఆమెకుకూడ ఉంటాయనిగాని, ఆమెకూడ సర్వసౌఖ్యముల ననుభవించేటందుకు హక్కు కలదనిగాని ఏ సంఘం కూడ అంగీకరించనప్పుడు, కరుడు కట్టుకుపోయిన మూర్ఖుల సంఘంలో ఒకరయిన సుబ్రహ్మణ్యంగారికి మాత్రం ఏం ఆలోచన తట్టుతుంది!

ఈ విధంగా ఉండగా ఆ వూరి కరణంగారు ఒకసారి ఎవరో పెళ్ళి పెద్దని తీసుకువచ్చి సుబ్రహ్మణ్యంగారికి చూపించి, వారి వారి సాంప్రదాయాల్ని విమర్శించి, బహు బీద కుటుంబీకుడగుటచేత, సంసార భారం ఎక్కువగుట వల్ల పిల్లలికి పెండ్లిండ్లు చేయలేకుండా ఉన్నాడనే భావం వెలిబుచ్చేటట్లు చిన్న ఉపోద్ఘాతం ఒకటి చెప్పి, పిల్లని మన యింటికి తీసుకొనివచ్చి, మనమే ఖర్చులు భరించి పెళ్ళి చేసుకోవాలని సుబ్రహ్మణ్యంగారికి నచ్చచెప్పి, మొత్తానికేదో విధంగా పెండ్లి ఖాయపరచేడు. భార్యా వియోగం వల్ల చాలా రోజుల నుంచి బాధపడుతున్న సుబ్రహ్మణ్యంగారికి కాస్త పెళ్ళి, పిల్ల కబుర్లు చెప్పడంతోనే ఒళ్ళు పులకరించింది. మళ్ళీ నూతన వధూ సంగమం గుర్తుకొచ్చింది. ఆ మర్నాటినుంచి కాస్త తలకి రంగు రాయడం, మీసాలకి రంగేయడం, సిల్కు లాల్చీలు, జరీ ఖండువాలలోకి దిగింది ఆయన వ్యవహారం. మొత్తానికి వివాహం ఖాయపరచి వివాహం చేసేరు. సుబ్రహ్మణ్యంగారి రెండవ భార్య కాపరానికొచ్చింది. రోజులు గడుస్తున్నాయి. సుబ్రహ్మణ్యంగారి యింట్లో నెమ్మదిగా అగ్గి రగులుతోంది. కారణాలు మరేం లేవు. పిల్లలు సావిత్రమ్మగార్ని, (సుబ్రహ్మణ్యంగారిభార్యని)'పిన్నీ' అని నోటూరాపిలవటం లేదని, ముసలి వెంకమ్మగారు మడి కుదరక ఏ సరుకులు ముట్టుకోనివ్వటం లేదని, బాల వితంతువైన కమల వాళ్ళ మేనత్త వెంకమ్మగారి మాటలు చెవిని పెడుతుందికాని తనమాటలు ఈషన్మాత్రం వినిపించుకోటం లేదనీను. ఇంటి గుట్టుమాత్రం బయటికి రావడంలేదు. ఈవిధంగా గడుస్తున్నాయి రోజులు.

ఒకనాడు సుబ్రహ్మణ్యంగారి ఓవేలు విడిచిన చెల్లెలిగారి అబ్బాయి మాధవరావు వాళ్ళ మామయ్యని, పిల్లల్ని చూచేటందుకు, చిన్నతనంలో ఆరోఏట చూచిన కమల ఏం చేస్తూందో ఊహించుకొంటూ దారిలో కనిపించిన రకరకాల పువ్వులు, దవనం, మరువం మొదలయిన వన్నీ పట్టుకొని ప్రొద్దుట తొమ్మిది గంటల బండిలో దిగేడు. మాధవరావుకు తండ్రి చిన్నతనంలోనే పోవడంచేత వాళ్ళ తల్లి చిన్నమ్మగారు అన్నగారిఊళ్ళో హైస్కూలు ఉందనే కాపరం పెట్టి చదువు చెప్పించింది. కొడుక్కి ఏదో

ఆస్తి దగ్గరదగ్గరగా పాతిక 30 ఎకరాలవరకూ ఉండడం వల్ల చిన్నమ్మగారు కొడుక్కి మద్రాసులో చదువు చెప్పిస్తోంది. సుబ్రహ్మణ్యంగారు రెండవ వివాహం చేసుకున్నారని చిన్నమ్మగార్కి కూడ తెలుసు. కాని పెళ్ళికి హాజరు కాలేదు. కమలకు తల్లి వల్ల జరిగిన మోసం కూడ వారికితెలుసు. ఇప్పుడు మాధవరావుకు ఇరవైమూడు సంవత్సరాల వయస్సు బి.ఏ. రెండో సంవత్సరం పరీక్షలు అయాక సెలవలకి వాళ్ళ మామయ్యని, కమలని, పిల్లల్ని చూచేటందుకు సుబ్రహ్మణ్యంగారింటికివచ్చేడు. మాధవరావు వచ్చేసరికి సుబ్రహ్మణ్యంగారు ఇంట్లో లేరు. పొరుగూరు ఏదో వ్యాపకంమీద వెళ్ళారు. మాధవరావును చూచి సుబ్రహ్మణ్యంగారి భార్య ఈక్రొత్త కుర్రాడు ఎవరా అనుకొంది. వెంకమ్మగారి మాటలధోరణి, "బావ! బావ!" అనుకుంటూ పిల్లలు మీదపడడం, అక్కడే ఓరగా నిల్చుని వారు చెప్పుకుంటూన్న మాటలు వింటూన్న కమలని, చూస్తే వాళ్ళచుట్టమే అని భావించింది. కాస్సేపు పిచ్చాపాటి అయిన తరువాత వెంకమ్మగారు వంటహడావిడిలో లోపలికి వెళ్ళింది. పిల్లలు మాధవరావు తీసుకువచ్చిన బిస్కట్లు, పిప్పరమెంట్లు తీసుకొని వీధులో ఆడుకుందుకు పోయారు. మాధవరావు నడవలో కుర్చీలో కూర్చుని "కమలా!" అని కేకవేసేడు. ఆగోడ ప్రక్కనున్న కమల గుమ్మంలోకి వచ్చి బావకేసి చూసి బుర్రవంచింది. "నాన్నేడీ?" అని అడిగేడు. "ప్రక్క ఊరికి వెళ్ళేడు" అని సమాధానం చెప్పింది. ఇప్పుడు ఇదివరకటి కమల కాదు. తను చిన్నతనంలో చూసినప్పుడు బావతో ఎక్కువ పరిచయంగా ఉండేది. ఇప్పుడు ఏమోగాని క్రొత్తమనిషిని చూసినట్లు చూస్తోంది. "మీ పిన్నిగారేరీ?" అని మళ్ళీ ప్రశ్నించేడు. "దొడ్లో నీళ్ళోసుకొంటోంది" అని సమాధానమిచ్చింది. కాస్త ధైర్యం వచ్చి కుర్చీలోంచి లేచి బుర్రవంచుకున్న కమలకు దగ్గరగా వచ్చి గెడ్డం క్రింద చెయ్యి పెట్టి బుర్రపైకెత్తి కమల కళ్ళలోకి చూసి "అలా ఉన్నావెందుకు?" అన్నాడు. ఆలాచూస్తుండగానే కమల కళ్ళల్లోంచి నీళ్ళు బొటబొట చెంపలమీదనుంచి జారి క్రింద పడ్డాయి. మాధవరావుకు కూడ తెలియకుండా కళ్ళలోనీళ్ళు తిరిగాయి. "ఏమిటిబావా! అది!" అని అడిగింది కమల. కళ్ళనీళ్ళు తుడుచుకొని వెమకకు తిరిగి నెమ్మదిగా అడుగు లేసుకుంటూ వెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు. తల తిరిగిపోతోంది. మనస్సు బాగులేదు. ఏమేమో ఆలోచనలు రైళ్ళమాదిరి మెదడులో పరుగెడుతున్నాయి. మాధవరావు చిన్నవాడయినా కమల కన్నీళ్ళ భావాన్ని గుర్తించగలిగేడు. కమల సంఘానికి, సంఘపు చేతిలో కీలుబొమ్మ అయిన తండ్రికి ఏం అపరాధం చేసిందో బోధపడలేదు. సంఘానికి తోడి మానవులు కష్టపడుతున్నారంటే సహాయంచేసే స్థోమతగాని, ఒకవేళ అట్టి స్థోమత ఉన్నప్పటికీ చేతకానివారనీ, నిర్భాగ్యులనీ, దురదృష్ట వంతులనీ, వాళ్ళు నించున్నచోట నిప్పు, నీళ్ళు పుట్టవని గేలిచేసే స్వభావమే కాని, తోడిమానవులకు సహాయంచేసే ఊహ సంఘానికి లేదని గ్రహించేడు. పోనీ కమల తన చేతులో నైనా ఉంటే ఈపాటికి మరోపెళ్ళిచేసి 'హాయిగా కాపురం చేసుకోమని అత్తవారింటికి పంపించే వాడేమో! ఏ ఆలోచనా తోచక ప్రయాణపు బడలికచే చిన్నకునుకు తీశాడు. ఇంతలో పిల్లలిద్దరూ వీధిలోంచి పరుగెత్తుకొని వచ్చి మాధవరావు మీదపడ్డారు. కమల వచ్చి "అత్తయ్య అన్నానికి రమ్మంటోంది. నీళ్ళోసుకో బావా!" అంది. "బావ" అని తను ఎరగని పరాయి మగవాడిని సంబోధించడంతోనే ఆప్రక్కనే మసలుతూన్న సావిత్రమ్మగారి చెవిన్ని పడిందామాట. ఆమెకు ఏదో చెప్పజాలని అసూయ ఒక్కసారిగా ఆవహించింది మనస్సులో.

భోజనాలయ్యాయి. మాధవరావు ప్రయాణపు బడలిక చేత వాకిట్లో మంచం వాల్చుకు నిద్రపోయాడు. మధ్యాహ్నం మూడు గంటలయింది. ఇంట్లో వెంకమ్మగారు, సావిత్రమ్మగారు దెబ్బలాడుకున్నంత హంగామా చేస్తున్నారు. మధ్యలో కుర్రాళ్ళు కూడ ఏవేవో సావిత్రమ్మను కేకలేస్తున్నారు. మాధవరావుకు మెళకువవచ్చి జరగతేమో తెలుసుకుందామని లోపలికి వెళ్ళాడు. ఎంత నిలబడి విన్నా సంగతి బోధపడలేదు. ఆఖరికి ఊరభసలో "పువ్వులేనా పెట్టుకోనివ్వండి. ఇంకేమైనా చేయనీయండి!" అంది సావిత్రమ్మ. సావిత్రమ్మ కమలకన్నా ఐదారు సంవత్సరాలు పెద్దదైనా పెళ్లి మాత్రం మొన్న మొన్ననే అయింది కాబట్టి, తన పునిస్త్రీ తనమంతా వెళ్ళగక్కి మాట్లాడుతోంది. సావిత్రమ్మ పదమూడో ఏట పెద్దమనిషయి ఇంట్లో ఇరవై నాలుగేళ్లొచ్చేవరకూ కూర్చున్నా ఈ మధ్య పదకొండు సంవత్సరాల్లోజరిగిన సావిత్రమ్మపురాణ జీవితాన్ని ఏసంఘం వేలుపెట్టి చూపించలేకపోయినా, భర్త అంటే ఏమిటో తెలియని అవస్థలో సంఘం కమలని నిరోధించగలిగిరిది. నిజం కూడ అంతే. నానాటినుంచీ వస్తూన్న సంఘ ఆచారాన్ని వదులుకోలేరు. పోనీ సరి అయిన మార్గంలోనా నడిపించలేరు. చేతకాకో చేతనయ్యో చేసిన వివాహం

చెడిపోతే వితంతువని హేళన, విరసన చూపడం పరిపాటు. పోనీ సంఘంలోని ప్రతి మానవుడిని దేవుని సాక్షిగా ప్రమాణం జేసి తన కుటుంబంలో ఏ దోషం లేదని చెప్పమంటే ఒక్కడికీ నోరాడదు. పోనీ ఏ వేద శాస్త్రంలో నయినా వితంతు విమర్శ కలదా? అలా ఉన్న ఎడల ఏ పరిస్థితులలో స్త్రీని వితంతువని లెక్కలోకి తీసుకురావచ్చును? అని విమర్శించిన పెద్ద మనిషి ఉన్నాడా అంటే ఒక్కడూ సంఘంలోంచి బయటికి రాడు. అందరూ చేస్తున్నారు మేమూ చేస్తున్నాము అనే భావమే ప్రతి సంఘస్థుడికి. ఇందుకే వేమన్నగారు "తలలు బోడివైన తలపులు బోడివా?" అని అన్నారు.

మాధవరావు ఈసంగతంతా గ్రహించి, ఇదంతా మర్రేంకాదు పువ్వుల తగాయిదా అనుకున్నాడు. సాయంకాలమైంది. సుబ్రహ్మణ్యంగారు ఊరి నుండి వచ్చేరు. వచ్చీ రావడంతోనే మాధవరావు మామయ్యకు ఎదురు వెళ్ళాడు. సుబ్రహ్మణ్యంగారు మాధవరావుని చూచి "ఏరా! అబ్బాయి ఎప్పుడొచ్చావు?" అన్నారు. "ప్రొద్దుటే వచ్చేను-మామయ్యా!" అని జవాబు చెప్పేడు మాధవరావు. "అమ్మ కుశ్లాసాగా వుందా?" అని ప్రశ్నించేరు సుబ్రహ్మణ్యంగారు. "ఆఁ" అని సమాధానం చెప్పేడు. ఇలా అన్నుకుంటూనే దొడ్లోకి కాళ్ళు కడుక్కునేందుకి వెళ్ళారు సుబ్రహ్మణ్యంగారు. ఇక మాధవరావు ఆలోచిస్తున్నాడు తదేకధ్యానంతో. ఇంతలో ఆయన మళ్ళీ వచ్చి "ఏరా! అబ్బాయి! ఏమిటి విశేషాలు?" అన్నాడు. "ఆ! ఏమున్నాయి మామయ్యా! ఈమధ్య అమ్మకి వంట్లో బాగుండటంలేదు. ఆమధ్య పదిహేనులంఖణాలు చేసింది. ఇంకా ఒంట్లో నీరసం తగ్గలేదు ఏపనీ చేసుకోలేకుండా ఉంది. అందుచేత నాలుగురోజులుంచుకొని పంపించేస్తానని చెప్పి కమలని వెంటబెట్టుకు రమ్మంది" అని నెమ్మదిగా వేసేడు ప్లేటు. అసలు ఈడొచ్చిన పిల్ల ఇంట్లో ఉండడం వల్ల సుబ్రహ్మణ్యంగారికి ముళ్ళకంప ప్రక్కలో పెట్టుకు పడుకున్నట్లుంది. నాలుగురోజులు పీడేనా వదులుతుందనుకున్నారు ఆ అమాయకులు. "సరే! తీసుకెళ్ళరా! దానికేముంది!" అన్నారు. మరొకళ్ళంటికంటే ఆయన పంపేకపోను. అక్కగారిమీద అభిమానం కొద్దీ సరే అన్నారు. కమలని పిలిచి వాళ్ళత్తయ్యకి ఒంట్లో సుస్తీగా ఉన్నట్లు తెలియజేసి, కాస్త నాలుగురోజులు చేతోడుగా ఉండిరమ్మని చెప్పేరు.

నాలుగురోజులు పోయిన తరువాత ఒకనాటి తెల్లవారుఝామున నాలుగుగంటలకి కమలని, మాధవుని రైలు దాకా దిగవిడిచి వచ్చారు సుబ్రహ్మణ్యంగారు. రైలు చెన్నపట్నం వెళ్ళిపోతోంది. కొంతసేపయ్యాక మాధవరావు కమలతో "ఈమధ్య నేను పెళ్ళి చేసుకోబోతున్నాను కమలా!" అన్నాడు. "ఎవరిని?" అంది. "నిన్నే" అనేశాడు అదురూబెదురూ లేకుండా. ఇంత చులకనగా మాధవరావు మాట వదిలేసేడంటే పెద్దగా ఆశ్చర్య పడవలసిన అవసరం యేమీలేదు. కమలకి ఏమనాలో తెలియక ఒకసారి బుర్ర క్రిందకి దించి మళ్ళీ బావ కళ్ళల్లోకి చిరునవ్వు ముఖంతో చూచింది. మాధవరావు కమల కళ్ళల్లోకి చూసి "నన్ను చేసుకోవా?" అన్నాడు జాలిగా. "నాన్న చెయ్యడు బావా" అంది కమల. పాపం కమలకి నాన్నమీద అభిమానం చావలేదు. తన జీవితాన్ని నడిపేవాడు నాన్నే అనుకుంటోంది. "అయితే నీకు నన్ను చేసుకోవాలని ఉందా?" అన్నాడు మాధవరావు. "ఊ" అని బుర్రవంచుకుని సమాధానం చెప్పింది కమల. ఇంతలో మరో స్టేషనేదో వస్తూంటే ఇద్దరూ రైలుపెట్టెలోంచి బయటకు చూడ్డం మొదలెట్టారు. మధ్యాహ్నం పన్నెండు గంటలవేళకి రైలు మద్రాసు చేరింది. మాధవరావు టాక్సీని పిలిచి అందులోఎక్కి యిద్దరూ యిల్లు చేరేరు. అప్పటికి ఒంటిగంట కావస్తూంది. మాధవరావు తల్లి చిన్నమ్మగారు వీధి అరుగుమీద కూర్చుని, వీభూది చేతికిరాసుకుని దూదిపింజతీసి ఒత్తులు చేస్తోంది. వాళ్ళగుమ్మంలో కారు ఆగగానే ఎవరో అనుకొంది. మాధవరావుని, కమలని చూడగానే సంతోషం, ఆశ్చర్యం పట్టలేక వుప్పొంగిపోయింది. ఎంతో ఆదరంతో వారిని లోనికి తీసుకుపోయింది.

చిన్నమ్మగారు వంటకుపక్రమింపగా కమలే కలుగజేసుకుని వంట పూర్తిచేసింది. ఆమె కలుపుగోట్టు తనమునకు చిన్నమ్మగారు చాలసంతోషించింది. కమలామాధవులు కలిసి మెలిసి తిరుగుతూ ఎంతో ఆనందంగా వుండేవారు. ఇదంతా చూస్తూంటే చిన్నమ్మగారి మనస్సు పరిపరి విధాల పోయింది. వీళ్ళిద్దరినీ ఈవిధంగా ముదరబెడితే కొంప ముంచి నలుగురిలో నగుబాట్లు తెస్తారనుకొంది. చిన్నమ్మగారు పురాణ కాలపు మనిషి కావడం వల్ల ఏదో కొంత మనోవ్యధ పట్టింది. ఇదంతా ఏదో ఎబ్బెట్టుగా తోచింది. ఒకనాడు మాధరావుని దగ్గిరకు పిల్చి, తన నడవడిక బాగు లేదని, భర్త పోయిన పిల్లతో అంతలా

కలిసి మెలసి తిరుగుతే సంఘం హర్షించదనీ కొడుకుని అదమాయిస్తుంది. పాపం మాధవరావు తల్లికి ఏ జవాబు చెప్పకుండా చొక్కా తొడుక్కొని వీధిలోకి వెళ్లిపోయాడు. వీధిలోకి వెళ్లినవాడు మళ్ళీ సాయంకాలం వరకూ తిరిగి రాలేదు. ఇంటికివచ్చి చొక్కా విప్పి కాళ్ళు చేతులు కడుక్కొని లుంగీ కట్టుకుని వాకిట్లో మంచం వాల్చుకుని చల్లగాలికి పడుకున్నాడు. కమల అక్కడే గుమ్మం మెట్ల మీద వేళ్ళు నులుముకుంటూ కూచ్చుంది చిన్నమ్మగారు వచ్చి "మధ్యాహ్నం నుంచీ ఎక్కడికి వెళ్ళావురా అబ్బాయి!" అంది మాధవరావు గోళ్ళు కొరుక్కుంటూ తన్ను కాదన్నట్లు మాట్లాడకుండా ఊరుకున్నాడు. చిన్నమ్మగారు వంటింట్లోకి వెళ్ళి అన్నానికి రమ్మని కమలని, మాధవరావుని పిలిచింది.

"నాకు ఆకలిలేదమ్మా" అన్నాడు మాధవరావు. ఆ మర్నాటి నుంచి సత్యాగ్రహం చేయడం మొదలెట్టాడు. తిండిలేకపోవటాన్ని ఒళ్ళు తెలియని జ్వరం వచ్చింది. లేవలేనంత అశక్తత సంభవిచింది మాధవరావుకి. చిన్నమ్మగారు కొడుకు దుస్థితి చూచి దిగులు పడింది మాధవరావు దగ్గరకు వచ్చి అతని మంచంమీద కూర్చుని "అబ్బాయి!" అని లేపింది "ఆ!" అన్నాడు నీరసంగా చూస్తూ. అక్కడే గోడ దగ్గర కమల నిలబడి ఉంది. "నాయనా! ఎన్నాళ్ళు ఈ విధంగా నన్నేడిపిస్తావురా?" అంది. "ఇంక ఒక్క రోజు" అన్నాడు. చిన్నమ్మగారి గుండెలమీద బండరాయి పడ్డట్టయింది. అతనన్న మాటలో ఎంత అర్థముందో గ్రహించింది. ఆవిడ మనస్సు కలత పడిపోయింది. ఇంక కొడుకు దక్కేటట్టు లేదనుకొంది. "నన్నేం చెయ్యమన్నావురా నాయనా! నువ్వు ఏం చెయ్యమంటే అది చేస్తాను. చెప్పు బాబూ!" అంది. "అమ్మా" అన్నాడు జాలిగా చూస్తూ. "ఏం నాయనా!" అంది. "కమలని పెళ్ళి చేసుకుంటానమ్మా!" అన్నాడు. చిన్నమ్మగార్కి ఏమనాలో బోధ పడలేదు. తమ కళ్ళలోని దూలాలను వెతుక్కోలేక ఎదుటవారి కళ్ళలోని నలుసులను వెతికే కాకిమూక సంఘం, తన సనాతనధర్మం, మొదలైన పూర్వాచారాలన్నీ కళ్ళకి కట్టి నట్టయ్యాయి. "అమ్మా" అన్నాడు మాధవరావు. "అలాగే చేసుకో నాయనా!" అంది ఆమాతృదేవికి ఏమనాలో బోధపడక. సంతోషాన్ని పట్టలేక, ముఖమైనా కడుక్కోకుండా కమల చేతి కాఫీని త్రాగేడు. కొడుకు కాస్త కాఫీ త్రాగిన తరువాత చిన్నమ్మగార్కి ప్రాణమొచ్చింది.

మళ్ళీ మాధవరావు దేహారోగ్యం సరైన మార్గం లోకి వచ్చేటందుకు వారంరోజులు పట్టింది. ఒకనాడు ప్రొద్దుటే మాధవరావు, కమల తలంటి నీళ్ళుపోసు కున్నారు. తరువాత మాధవరావు టాక్సీ తీసుకొచ్చాడు. తల్లి, కమల, తను టాక్సీలో రిజిష్ట్రారు ఆఫీసుకి వెళ్ళారు.

చిన్నమ్మగారు ఎక్కడికో అనుకొంది. కమలకి మాత్రం బావ చేసే పనంతా తెలుసు. సర్కారువారి సమక్షంలో కమల, మాధవరావుల వివాహం రిజిష్ట్రారు పౌరోహితుడుగారు చేసేసి, తమ రిజిష్టర్ల సాక్షిగా ఒక రసీదు తీసి మాధవరావు చేతులో పెట్టాడు. ఆ కాగితం తల్లికి చూపించి "పెళ్ళయి పోయిందమ్మా!" అన్నాడు. "ఇదేం పెళ్ళిరా? నాయనా!" అంది చిన్నమ్మగారు. "డబ్బు ఖర్చులేనటువంటి, ఎవరూ చెడగొట్టలేనటు వంటి పెళ్ళి ఇదేనమ్మా!" అన్నాడు. అందరూ ఇల్లు చేరుకున్నారు. ఆనాటినుంచి చిన్నమ్మగారు కమల,మాధవ రావులను విచ్చల విడిగా ఒదిలేసింది. కమలల జీవితంలో నూతన శకారంభం మొదలిడింది. రోజులు, నెలలు గడిచి పోతున్నాయి. పిల్ల క్షేమ సమాచారాలు తెలియక్కుంటం లేదని ఒకనాడు సుబ్రహ్మణ్యంగారు వాళ్ళ చెల్లెలయ్యిన చిన్నమ్మ గారింటికి మద్రాసుకు ఉత్తరమేనా వ్రాయకుండా వచ్చేశారు. గుమ్మంలో కమల పూర్ణగర్భంతో కనుపించింది. ఇంకే ముంది! కళ్ళొదిలి చూడ్డం మొదలెట్టా డాయన. "రానాన్నా!" అంది కమల. "నాపరువు తీసేసేవే! దుర్మార్గురాలా!" అని మళ్ళీ అక్కడ నిలబడకుండా వెను దిరిగి వెళ్ళిపోయాడు. ఇంతలో మాధవరావు ఇంట్లోంచి వచ్చేడు. వాళ్ళ నాన్న వెళ్ళిపోతూంటే చూస్తున్న కమలని చూసి "ఏమిటి కమలా! అలా చూస్తున్నావు?" అన్నాడు. "మానాన్న ఇక్కడికి వచ్చి నన్నుచూసి వెళ్ళిపోతున్నా డండీ!" అంది. "ఏడీ!" అని అటు చూసేడు మాధవరావు. అప్పటికే సుబ్రహ్మణ్యంగారు చాలా దూరం నడిచి వెళ్ళిపోయారు. "హు! స్వార్థపరుడు. సంఘాన్ని వదిలిపెట్టలేక కన్న కూతుర్ని ఒదిలేడు" అన్నాడు. సుబ్రహ్మణ్యంగారు కనుచూపుమేర దాటి పోయేవరకూ వాళ్ళిద్దరూ అలాగే చూస్తూ నిలబడి తరువాత ఇంట్లోకి వచ్చేశారు. అటువెళ్ళిన సుబ్రహ్మణ్యంగారు ఇటు రానేలేదు. సంవత్సరాలు గడిచి పోతున్నాయి. ఇక ముందు కూడ రాదేమో!